గోకులాల బిల్లులేవీ..?!

- పాడిరైతులతో హడావుడిగా మినీ గోకులాలను పూర్తి చేయించిన అధికారులు
- ఇంతవరకు బిల్లులు మంజూరు చేయని ప్రభుత్వం
- బిల్లుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూపులు
- చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ ఇబ్బందులు



అమరావతిలో పూర్తయిన మినీ గోకులం షెడ్డు

అమరావతి: పల్లెల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన మినీ గోకులాల పథకం లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. 'మీ పశువులకు షెడ్డులు నిర్మించుకోండి... రాయితీ రూపంలో వచ్చే నగదును మీ బ్యాంకు ఖాతాలకు 15రోజుల్లో జమచేస్తామని' పాడి రైతులకు చెప్పిన అధికారులు నేడు బిల్లుల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు

మండలానికి 25 షెడ్లు ..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం పేరుతో పాడి రైతులకు పాడి, పశుపోషణ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది పల్నాడు జిల్లావ్యాప్తంగా 712 గోకులం షెడ్లు మంజూరు కాగా, అందులో ఇప్పటికి 400కి పైగా నిర్మాణాలు పూర్తి చేసుకుని బిల్లులు చెల్లించాల్సి ఉంది. 67 గోకులాల నిర్మాణం చివరిదశలో ఉన్నాయి, మిగిలినవి ప్రారంభదశలో ఉన్నాయి ప్రతి మండలానికి 25 చొప్పున కేటాయించారు. ఉపాధి ఏపీఓ, ఎంపీడీఓ, పశు సంవర్ధకశాఖ ఏడీ, పశు వైద్యాధికారి, వెలుగు ఏపీఎంతో కూడిన కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయితే వీటిని పూర్తిగా కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సుల మేరకే మంజూరు చేశారనే విమర్శలు ఉన్నాయి.

హడావుడిగా పూర్తిచేయించిన అధికారులు

గోకులం కింద జత పశువులకు సంబంధించిన షెడ్డుకు రూ.1.15 లక్షలు, 4 పశువుల లబ్ధిదారుడు నిర్మించుకున్న షెడ్డుకు రూ.1.85 లక్షలు, 6 పశువుల షెడ్డుకు రూ.2.30 లక్షల చొప్పున వస్తాయని షెడ్డు నిర్మాణం మొదలు పెట్టించారు. లబ్ధిదారులు అధికంగా ఆరు పశువుల సామర్థ్యం గల షెడ్లనే నిర్మాణం చేశారు. ఇందులో రైతు 10 శాతం ఖర్చు చేయాల్సి ఉంది. ఇదే క్రమంలో జీవాలు ఉంటే 20 జీవాలు గల షెడ్లకు రూ.1.30 లక్షలు, 50 జీవాల సామర్థ్యం గల షెడ్లకు రూ.2.30లక్షలు ఇస్తామని వీటికి లబ్ధిదారుడు వాటా 30 శాతం చెల్లించాలని నిర్ణయించారు. గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను అక్టోబరు, నవంబరు నెలల్లో మొదలుపెట్టి రెండు వారాలలో పూర్తి చేశారు. ఉపాధి హామీ సిబ్బంది హడావుడి చేసి లబ్ధిదారులచే షెడ్లను పూర్తి చేయించారు.

అప్పులకు వడ్డీలు కడుతూ...

మినీ గోకులాల నిర్మాణం పూర్తి చేస్తే 15 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ అవుతుందని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కానీ మూడు నెలలవుతున్నా ప్రభుత్వం ఇంతవరకు సొమ్ము వారి ఖాతాల్లో జమచేయకపోవడంతో లబ్ధిదారులు ఆవేదనకు గురవుతున్నారు. అప్పులు చేసి ఈ షెడ్డులు నిర్మించామని ఇప్పుడు వాటికి వడ్డీలు కడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాడిరైతులు రాయితీ నగదు జమ కాక కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించక తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు అప్పగించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు రెండు శాఖల అధికారులు ఈ నిర్మాణాలు పూర్తి చేయించి చేతులు దులుపేసుకున్నారని ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు చెల్లించాల్సిన రాయితీ నగదును వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ఇప్పటికి రూ.1300 మాత్రమే జమ

గోకులం షెడ్ల నిర్మాణంలో మూడు దశల్లో బిల్లులు లబ్ధిదారులకు అందించాల్సి ఉండగా బిల్లులు పడకపోయినా షెడ్లు పూర్తి చేయాలని, మూడు బిల్లులు ఒకేసారి పడతాయని చెప్పి నిర్మాణాలను పూర్తి చేయించారు. జనవరి 10, 12వ తేదీల్లో షెడ్యూల్ ఏర్పాటు చేసిన అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మండల, గ్రామస్థాయి నాయకులు అధికారులతో కలిసి గోకులం షెడ్లను అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఇంతవరకు లబ్ధిదారుల ఖాతాలలో రూ.1300 మాత్రమే జమయ్యాయి. బిల్లులు రాక ఎదురుచూపులు చూస్తున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

బిల్లులు ఒకేసారి చెల్లిస్తాం..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు బిల్లులు పూర్తి చేసి అప్‌లోడ్ చేయటం జరిగింది. ప్రభుత్వం ఈనెల 15వతేదీ లోపు బిల్లులు చెల్లించే అవకాశం ఉంది. మూడు విడతలుగా పడాల్సిన బిల్లులు పూర్తయిన షెడ్లకు ఒకేసారి చెల్లించటం జరుగుతుంది.

– సిద్ధ లింగమూర్తి, ద్వామా పీడీ, పల్నాడు జిల్లా

సుజుకి యాక్సెస్-125 సీసీ వాహనం ఆవిష్కరణ



సత్తెనపల్లి: వయసుతో నిమిత్తం లేకుండా అన్ని వయసుల వారికి సుజుకి యాక్సెస్ -125 సీసీ వాహనం అనువైందని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర రాంబాబు అన్నారు. పట్టణంలోని అంబికా ఆటోమోటివ్ సుజుకి షోరూంలో గురువారం కొత్త మోడల్ సుజుకి యాక్సెస్ -125 సీసీ స్కూటీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాంబాబు మాట్లాడుతూ ఈ స్కూటీ కేవలం అన్ని వయసుల వారు, మహిళలు నడిపేందుకు వీలుగా ఉందన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞాన,ం నాణ్యతతో ఈ వాహనాన్ని మార్కెట్‌లోకి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావులు సుజుకి 125 సీసీ వాహనాలను నడిపి ప్రారంభించారు. కార్యక్రమంలో అంబికా ఆటోమోటివ్ సుజుకీ షోరూం అధినేత తోట అంబిక, అనన్య వైద్యశాల అధినేత డాక్టర్ చల్లా నాగ రాజారెడ్డి, కొత్త రామకృష్ణ, అంబికా ఆటోమేటివ్, ఫైనాన్స్ సిబ్బంది, కస్టమర్లు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు సర్వం సిద్ధం

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రె.ఫాదర్ ఎం. పీటర్ పాపయ్య, స్కూల్ హెచ్‌ఎం సీహెచ్ దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ వేడుకలు జరుగుతాయన్నారు.

క్లుప్తంగా

తిరునాళ్ల వేలం ఆదాయం రూ.3.90 లక్షలు



క్రోసూరు: ఈనెల 12న అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు లోని గంగాదేవీ పేరంటాళ్లమ్మవారి తిరుణాళ్ల కోసం గురువారం నిర్వహించిన హక్కుల వేలం పాటల ద్వారా దేవదాయశాఖకు రూ.3.90లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ ఒ.కోటేశ్వరరావు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు దేవస్థానం స్థానిక వీరభద్రమల్లేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో పాటలు నిర్వహించింది. పాటల ద్వారా గత ఏడాది రూ.3,30,000 సమకూరగా ఈఏడాది రూ.3,90,000 సమకూరిందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.60 వేలు అదనంగా ఆదాయం సమకూరిందని ఈఓ తెలియచేసారు. దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ఎం.లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల నిర్వహణపై ఫిర్యాదు

అమరావతి: మద్యం షాపుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా రేకుల షెడ్లు వేసి, నాపరాళ్లపై కూర్చొని మద్యం తాగే విధంగా ఏర్పాట్లు ఉన్నాయని, ఇలా మందుబాబులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేస్తున్నారని గురువారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులుకు ప్రజా సంఘాల కన్వీనర్ బి.సూరిబాబు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గతంలో ఇలాగే అన్ని సౌకర్యాలు కల్పిస్తే, వాటిపై ఫిర్యాదులు వచ్చిన తర్వాత వాటిని తొలగించడం, మళ్లీ మద్యం దుకాణాల వారు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే గురువారం ఎక్సైజ్ సిబ్బంది మద్యం షాపులకు తనిఖీకి వస్తే అధికారుల కళ్లముందే తాగుతున్న మందుబాబులను చూసి అవాక్కయ్యారన్నారు. ఎక్సైజ్ శాఖాధికారులు ఇప్పటికైనా వేసిన షెడ్లను కూల్చి, కూర్చోవడానికి ఏర్పాటు చేసిన బల్లలు, నాపరాళ్లు తొలగించి అవసరమైతే ప్రత్యేక నిఘా కేమెరాలను ఏర్పాట్లు చేయాలని కోరామని తెలిపారు. ప్రజాసంఘాల సభ్యుడు దారా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని గడియార స్తంభం వద్ద గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని చల్లా వారివీధికి చెందిన వృద్ధుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి షేక్ మహబూబ్ సుభాని గడియార స్తంభం వద్ద రోడ్డు దాటే క్రమంలో గుంటూరు వైపు నుంచి మాచర్ల వైపు వెళుతున్న పొక్లెయిన్ ప్రమాదవశాత్తు ఢీ కొట్టడంతో ఆయన రెండు కాళ్ల పైకి ఎక్కడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడికి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



నకరికల్లు: స్థానిక బెల్లం కొండ బ్రాంచి కాలువలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం వెలికితీశారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన లారీడ్రైవర్ బసప్ప (40) లారీడ్రైవర్ కాలువలో బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లి జారిపడి గల్లంతైన విషయం పాఠకులకు విధితమే. బుధవారం రాత్రి నుంచి చేపట్టిన గాలింపు చర్యల్లో గురువారం మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

లగడపాడులో చోరీపై కేసు నమోదు

పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడు గ్రామానికి చెందిన షేక్ షాహినా ఇంట్లో బుధవారం జగరిగిన చోరీపై గురువారం పెదకూరపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం షాహినా తన తండ్రి ఇంటి వద్ద ఉంచి, పొలం పనులకు వెళ్లింది. ఈక్రమంలో షాహినా తండ్రి బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న సుమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పని నుంచి తిరిగి వచ్చిన షాహినా ఇంట్లో ఉన్న ఆభరణాలు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుని పోయారని నిర్ధారించుకుని బుధవారం రాత్రి పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పోలీసుల అదుపులోకి చోరీ కేసులో నిందితుడు ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

సత్తెనపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కాకతీయ కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ కావూరి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ జీవితంలో టర్నింగ్ పాయింట్ అన్నారు. భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలంటే ఇంటర్మీడియట్‌లో వేసే ప్రతి అడుగు ముఖ్యమైనదన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సభలో డీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ పాతూరి శ్రీనివాసరావు, కృష్ణవేణి కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరవల్లి సుజాత మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశాలలో అన్న సంతర్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నిరుపేద రోగులు, వారికి సహాయ కులుగా వచ్చిన వారికి వైద్యశాలలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మండవ రాధ ఆమె కుమార్తె ఎన్ఆర్ఐ యర్రా వినీల జన్మదినం సందర్భంగా గురువారం 120 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభి నందించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జవ్వాజి రామమోహన్‌రావు, నాయకులు అప్పాపురపు నరేంద్ర, పులిపాటి శ్రీరామ్మూర్తి, కొత్త లక్ష్మయ్య, పోతుగంటి రామకోటేశ్వరరావు, ఎస్‌వీఎల్ నరసింహారావు, దూప గుంట్ల జానకిరామారావు, దివ్వెల శ్రీనివాసరావు, కట్టమూరు అప్పారావు, పోతుగంటి నరసింహారావు,కోటేశ్వరరావు, వైద్యశాల ఉద్యోగులు జి.విజయలక్ష్మి, కాగిత మాధవి దేవి, బంగారు పాప, సునీత, న్యాయవాదులు పాల్గొన్నారు.

దక్షిణమధ్య రైల్వే సలహాదారు 'ఉల్లం'కు సత్కారం



సత్తెనపల్లి: దక్షిణ మధ్య రైల్వే న్యాయ సలహాదారుడిగా ఇటీవల నియమితులైన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావును సత్తెనపల్లి ఏజీకేఎం వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు ఆళ్ల శేఖర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ రాజకీయ వేత్త కమతం కాశిరెడ్డి, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు ఉన్నారు.

లైంగికదాడిపై కేసు నమోదు

మాచవరం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి రెండు రోజులుగా ఆరోగ్యం బాగోలేక ఇంటి వద్దనే ఉంటుంది. అదే గ్రామానికి చెందిన నల్లమేకల వెంకటేష్ ప్రతి రోజూ అదే వీధి గుండా మేకలు తోలుకుంటూ వెళ్తుండేవాడు. ఇంటి తలుపులు తీసి ఉండండతో ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి ఇంట్లోకి ప్రవేశించాడు. యువతి కేకలు వేయకుండా నోట్లో గుడ్డలు కుక్కి లైంగికదాడి చేశాడు. యువతి తల్లిదండ్రుల రాకను గమనించి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.

కేఎస్ లక్ష్మణరావు విజయానికి కృషిచేద్దాం

నకరికల్లు: శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీగా కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించి సమర్థవంతమైన మేధావిని మరోసారి చట్టసభలకు పంపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ్‌కుమార్ కోరారు. గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎన్నికల పోటీలో ఉన్న కె.ఎస్.లక్ష్మణరావు తరపున మండలంలో గురువారం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు వంగర తులసి, సీఐటీయూ నాయకుడు ఈవూరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల: గుంటూరు–కృష్ణా శాసనమండలి ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలో కౌలు రైతు, వ్యవసాయకార్మిక ప్రజానాట్యమండలి, మహిళా సంఘం, ఉపాధ్యాయ సంఘాల సమావేశం గురువారం జరిగింది. ఈ నెల 10వ తేదీన లక్ష్మణరావు నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా అన్ని సంఘాల వారు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మార్పుల వెంకటరెడ్డి, గారా జాలయ్య, తొండపి మస్తాన్‌రావు, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రమాదేవికి ఇండియన్ ఉమెన్ ఐకాన్ అవార్డు ప్రదానం



రచయిత్రి రమాదేవిని సత్కరిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 2న స్వామి వివేకానంద ఇండియన్ ఉమెన్ ఐకాన్ అవార్డును ప్రదానం చేశారు. సాహిత్య రంగంలో రమాదేవి చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు వెలుగు జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం-2025లో భాగంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అధ్యక్షుడు పోలోజ్ రాజ్‌కుమార్, దేవరకొండ వెంకటరమణ, మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఆమెకు అవార్డ్ అందచేసి మెమెంటో, సర్టిఫికెట్, మెడల్ ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరికొండ రమాదేవిని సత్తెనపల్లిలోని వివిధ కళాసంస్థల అధినేతలు, కార్యదర్శులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

పట్టభద్రుల పోలింగ్‌కు సమాయత్తం

- నియోజకవర్గంలో పట్టభద్ర ఓటర్లు 9,699 మంది
- నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

నియోజకవర్గంలో ఓటర్లు	9,699
పురుషులు	6,459
మహిళలు	3,238
ఇతరులు	01
పోలింగ్ కేంద్రాలు	12
1000 ఓట్లు లోపు ఉన్న కేంద్రాలు	10

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. సోమవారం ఎన్నికల నోటిఫి కేషన్ విడుదలైన నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని కళాశాలలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి పరిశీలించారు. ఎన్నికల కోడ్ గత నెల 29న అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇటీవల సమావేశాన్ని నిర్వహించారు. కోడ్ అమలు, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. కోడ్ పక్కాగా అమలు చేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం చర్యలు తప్పవన్నారు. నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 2024 డిసెంబర్ 30 నాటి జాబితా ప్రకారం నియోజకవర్గంలో 9,699 మంది పట్టభద్రులు ఉన్న ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచారు. ఈ సంఖ్య ఇంకా పెరగనుంది. ఈ సారి ఎక్కువ శాతం పోలింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోడ్ అమలుకు స్టాటిక్ సర్వేలైన్స్ బృందం (ఒక గెజిటెడ్ అధికారి, కానిస్టేబుల్, వార్డు సచివాలయ ఉద్యోగి). ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం (ఒక గెజిటెడ్ అధికారి, కానిస్టేబుల్, వార్డు సచివాలయం ఉద్యోగి). స్పెషల్ వీడియో బృందం (ఒక గెజిటెడ్ అధికారి, వార్డు సచివాలయం ఉద్యోగి, వీడియో గ్రాఫర్)ను నియమించారు.

నీటిఎద్దడి నివారణకు కృషి చేద్దాం

మండల పరిషత్ సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాజుపాలెం: వేసవి సమీపిస్తున్నందున గ్రామాలలో నీటి ఎద్దడి ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలకు ప్రజలు సహకరించాలని తెలిపారు. మండలంలో ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున కొత్త పనులు ఎక్కడ ప్రారంభించరాదని సూచించారు. నీటి ఎద్దడి అధికంగా ఉంటే ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపుతామని చెప్పారు. ముందుగా మండల స్థాయి అధికారులు వారి శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తహసీల్దార్ దుర్గేష్‌రావు, ఎంఈఓ మల్లికార్జునశర్మ, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, ఏఓ వెంకట నర్సయ్య, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల దుంగలు తరలిస్తున్న ట్రాక్టర్ మాయం

- నిందితులతో ఓ ఎస్ఎస్‌పీ అధికారి కుమ్మక్కు!
- టీడీపీ నేత హెచ్చరికలతో నిందితులను తప్పించే యత్నం



కాల్వ కట్టపై కోతకు గురైన చెట్లు

ముప్పాళ్ల: ముప్పాళ్లకు ఆనుకునిఉన్న పెదనంది పాడు బ్రాంచి కాలువ కట్టపై ఉన్న చెట్లు మాయంపై 'బరి తెగించిన పచ్చనేతలు' శీర్షికన 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైన విషయం పాఠక విధితమే.. అయితే ఈ ఘటనలపై ఎస్ఎస్పీ అధికారులు నోరు మెదపడం లేదు. దాదాపు వారం రోజుల నుంచి సుమారు నాలుగు ట్రాక్టర్‌లలో చెట్లు కొట్టి అమ్మకాలు జరుపుకొన్నా ఎస్ఎస్పీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెట్లు కొట్టివేతకు పాల్పడే వారితో ఎస్ఎస్పీ అధికారుల మధ్య రాజీ ప్రయత్నాలు కుదరటంతో పోలీసులకు కూడా ఎలాంటి సమాచారం అందివ్వకుండా వ్యవహారం చక్కబెట్టుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే దుంగలు తరలించేందుకు ఉపయోగించే ట్రాక్టర్‌ను పక్కకు తప్పించి, దుంగలను మాత్రమే కాల్వ కట్టపై ఉంచారు. దుంగలకు వేలం నిర్వహిస్తామని ఎస్ఎస్పీ సిబ్బంది చెబుతున్నారు.

టీడీపీ నాయకుడి రంగప్రవేశంతో...

నకరికల్లు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు రంగప్రవేశంతో వ్యవహారం అంతా పక్కదారి పట్టింది. దుంగలు తరలించేవారంతా తమ అనుచరులని, వారిపైన ఎలాంటి చర్యలు తీసుకున్నా సహించేది లేదని ఆయన హెచ్చరికలు చేయడంతో ట్రాక్టర్‌ను, అందులో ప్రమేయం ఉన్న వారిని పక్కకు తప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పైగా ఈ వ్యవహారంలో ఎస్ఎస్పీలో పని చేసే సిబ్బందితో పాటుగా ఒక అధికారి హస్తం కూడా ఉండటం గమనార్హం. విచారణ చేపట్టాల్సిన అధికారే ఈ అక్రమాల్లో ఉండటంతో వాస్తవాలు వెలుగులోకి రావటం అసాధ్యమని ఎస్ఎస్పీ సిబ్బంది చెబుతున్నారు. వారిరువురూ కలిసే ఈ చెట్లు అక్రమ కొట్టివేత ప్రక్రియ జరుపుతున్నట్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పొంజు సేవ



మోర్జంపాడులో నరసింహస్వామి ఊరేగింపు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లక్ష్మీనరసింహా స్వామి 69వ కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం నందు వైభవంగా పొంజు సేవా కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వామివారిని ఉగ్ర నరసింహునిగా అలకంరించి, గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి మాలధారణ ధరించిన భక్తులు ఊరేగింపుగా ముడుపులతో దేవాలయానికి చేరుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ భక్త భజన బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు విశేషంగా తరలివచ్చారు. శుక్రవారం స్వామి వారి కల్యాణం కన్నుల విందుగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

దాచేపల్లి: ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ అన్నారు. మండలంలోని మాదినపాడు గ్రామంలో రైతు నరసింహరావు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆకుకూరలు, కూరగాయలు, బంగాళదుంప, తీగజాతి, పండ్లు పండిస్తున్నానని, 365 రోజుల పాటు ఆదాయం పొందుతున్నానని ఆయన వివవరించారు. రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ మాట్లాడుతూ.. వివిధ రకాల జాతుల మొక్కలు సాగు చేయటం వల్ల ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ విధానం వల్ల భూసారం పెరిగి దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానం వల్ల పంటల ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమరాజ్, అధికారులు అప్పలరాజు, సైదయ్య, బాజిబాబు, యూనిట్ ఇన్‌చార్జీ కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.